క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం వేకువజామున అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో కమనీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు పరిశీలన



ఈ–పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండలంలోని రాచాయపేట రైతు భరోసా కేంద్రం పరిధిలో బుధవారం కడప రైతు శిక్షణ కేంద్రం డీడీఏ రమణారెడ్డి, ఏఓ అరవిందనాయక్ ఈ–పంట నమోదును పరిశీలించారు. రబీలో సాగైన పంటలకు సంబంధించి ఈ–పంట నమోదు సక్రమంగా చేశారా లేదా అనే విషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో చర్చించారు. ఈ–పంట నమోదు ఆధారంగా రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, పంటలకు గిట్టుబాటు ధర తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ఆర్బీకే సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖల సమన్వయంతో ఈ–పంట నమోదు చేయాలన్నారు. విస్తరణాధికారి ఓబయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ



స్పోర్ట్స్ డ్రెస్ తో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లె గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కపిల్ చిట్స్ రాయలసీమ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ బాల బయపురెడ్డి ఆధ్వర్యంలో 20 మందికి స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశారు. అలాగే 2022–23 ఏడాది పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె–3 గ్రామ సచివాలయం వద్ద బుధవారం లబ్ధిదారులకు మండల అధ్యక్షులు వీరనారాయణరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అన్ని రకాలైన ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. మండలానికి 275 మందికి వివిధ రకాలైన కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీపీ తెలిపారు. అనంతరం సోమిరెడ్డిపల్లెలోని ఎంపీపీ స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సర్పంచ్ రామయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి కావ్య మాధురి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

323 కొత్త పింఛన్లు మంజూరు

కాశినాయన : మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని 323 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ మైథిలి, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్ తెలిపారు. లబ్ధిదారులకు బుధవారం వలంటీర్ల ద్వారా నగదును అందజేసినట్లు వారు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



చాపాడు మండలం అనంతపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

చాపాడు : ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకు తిరుగుతున్నామని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. చాపాడు మండల పరిధిలోని ఎస్.ఓబాయపల్లె పంచాయతీ, నక్కలదిన్నె, దళితవాడ, తూర్పు అనంతపురం, పడమర అనంతపురం గ్రామాల్లో బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంగులయ్య ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పడమర అనంతపురంలో దారి కావాలని, డ్రైనేజీ కాలువలను నిర్మించాలని దళితులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, దీని కోసమే ఇంటింటికి వస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, ఎంపీటీసీ పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మాధవరెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, పీవీ రమణారెడ్డి, గండు రాజు, బొలేరో బాషా, వెంకటరెడ్డి, వీరారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ ఆదర్శం

చాపాడు : సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నక్కలదిన్నె గ్రామ సచివాలయం వద్ద బుధవారం నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాపాడు మండలానికి నూతనంగా 552 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎంపీపీ లక్ష్మయ్య, సర్పంచ్ అంజనమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దార్ సుభాని, ఏఓ మ్యాగీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ రాజ్ ఏఈ ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

దువ్వూరు : పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచనపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిపల్లె నాగిరెడ్డితో కలసి ఎమ్మెల్యే గడపగడపకు తిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు. ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, సచివాలయాల కన్వీనర్ శంకర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్, వీరమోహన్, హరినాథరెడ్డి, గోపిరెడ్డి శ్రీను, వీవీ స్వామి, కుంపటి ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.



మాచనపల్లెలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : మండలంలోని చెన్నమరాజుపల్లె దువ్వూరు రోడ్డు మంజునాథ కాలనీలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వరికూటి ఓబుళరెడ్డి, రామాంజనేయరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే సీఎం ధ్యేయం



ఆర్టీసీ ఉద్యోగులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

మైదుకూరు : రాష్ట్రంలో మహిళా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. అందుకే ప్రతి సంక్షేమ పథకాల అమలులో సీఎం మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తాము పొదుపు చేసే సొమ్ముకు తోడు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో చిరు వ్యాపారాలతో మొదలు పెట్టి మార్ట్‌ల వరకు ఎదుగుతున్నారని ప్రశంసించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, మెప్మా టీఈ మహాలక్ష్మి, సీఓలు పుల్లయ్య, రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కరిడి రమణమూర్తి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సూర్య నాగమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

యూనియన్‌కు గుర్తింపుపై సంబరాలు

ప్రజా రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్‌టీసీ)లో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు పెద్ద యూనియన్‌గా గుర్తింపు లభించడం పట్ల బుధవారం మైదుకూరు ఆర్టీసీ డిపోలో యూనియన్ నాయకులు సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ మాచనూరుచంద్ర పాల్గొన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక యూనియన్‌కు గుర్తింపు ఇచ్చారని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్‌రావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.భాస్కర్‌రెడ్డి, గ్యారేజి కార్యదర్శి రాయుడు పాల్గొన్నారు.

15న మైదుకూరులో జగనన్నకు చెబుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

మైదుకూరు : మైదుకూరులో ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ కార్యక్రమ ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణపై ఆర్డీఓ పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి వైఎ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో ప్రతి శాఖ పరిధిలోని సమస్యలను గుర్తించి నమోదు చేయాలని అధికారులకు తెలిపారు. కలెక్టర్ సహా అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలపై కార్యక్రమంలో అర్జీలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. సమస్యలను విన్నవించేందుకు వచ్చేవారి వివరాలను రిజిస్టర్ చేయాలని అధికారులకు సూచించారు.

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

వినాయక చవితి పండుగ నిర్వాహకులు మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణ అన్నారు. భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విగ్రహ మండపాలను ఏర్పాటు చేసి పండుగను నిర్వహించే వారి వివరాలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండెకరాల్లో క్రీడా మైదానానికి కృషి



క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న కల్లూరు నాగేంద్రా రెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలో కల్లూరు గ్రామంలో రెండెకరాల్లో క్రీడా మైదానానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి తెలిపారు. కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి అండర్ 14, 17 బాలబాలికలకు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించి ఎంపికలు చేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జె.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లూరు నాగేంద్రారెడ్డి మాట్లాడుతూ జెడ్పీ హైస్కూల్ వేదికగా జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులు బాగా రాణించి నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. క్రీడలను వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ బాబు, కైపు ఓబయ్య, ప్రసాద్‌రెడ్డి, నడిగడ్డ సుధాకర్, శ్యామ్యూల్, లక్ష్మీదేవి, ఉషారాణి, మాధవిలత, కృష్ణవేణి, సుహాస పర్యవేక్షించారు. కల్లూరు ఉపసర్పంచ్ మహేంద్రరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ బీసీ వెంకటసుబ్బయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం కోసం టీకాలు



ఎంసీపీ కార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యుహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ అలీ

ప్రొద్దుటూరు క్రైం : చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు టీకాలను వేయించుకోవాలని డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ అలీ తెలిపారు. పట్టణంలోని బొల్లవరం క్రిష్టియన్ కాలనీ, బాపూజీనగర్‌లలో బుధవారం ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ అలీ పరిశీలించారు. ఆ ప్రాంతంలో టీకాలు ఎలా వేస్తున్నారో ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎంసీపీ కార్డులను పరిశీలించి తల్లులతో మాట్లాడారు. అలాగే అంగన్‌వాడి సెంటర్‌లలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. టీకాల ఆవశ్యకత గురించి వివరించారు. సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎంలు గృహలక్ష్మి, స్వర్ణలత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘాలను సద్వినియోగం చేసుకోండి



రాజుపాలెంలో పట్టలను అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

రాజుపాళెం : రైతులంతా రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరి అందులో అందించే వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. మండలంలోని ఎంఎస్, ఎఫ్‌పీఓ కార్యాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం కుమ్మరపల్లె శివ గణేష్ సంఘం సభ్యుడైన పుల్లయ్యకు తారపట్ట, అర్కటవేముల వెంకటేశ్వర స్వామి సంఘంకు పీఎఫ్ రూ.2 లక్షలు చెక్కులను ఆనంద్ నాయక్, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు వంగలి దస్తగిరి సాహెబ్ అందించారు. కార్యక్రమంలో మండల ఏపీఎం జయరాజ్, ఎఫ్‌పీఓ సీసీ గౌస్, సీసీలు పాల్గొన్నారు.

17న ట్రీ గణేష్ విగ్రహాలు పంపిణీ

ప్రొద్దుటూరు : వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 17న ఆదివారం సాయంత్రం 5గంటలకు స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద టోకెన్లు ఇచ్చిన వారికి ట్రీ గణేష్ విగ్రహాలను పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎటువంటి కెమికల్స్ లేకుండా మట్టితో తయారు చేసిన ట్రీ గణేష్ విగ్రహాలను ఎల్‌ఐసీ బ్రాంచ్ కోడ్ 663కు సమానంగా 663 విగ్రహాలను అందిస్తామని వారు పేర్కొన్నారు. ఎల్‌ఐసీ స్టాఫ్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు ఈనెల 15, 16 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోకెన్లు తీసుకెళ్లవచ్చని వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

బద్వేలు అర్బన్ : బద్వేలు డిపోలో ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225779 నెంబరుకు డయల్ చేయడంతో పాటు వాట్సాప్ మెసేజ్ చేయవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు గంగనపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

కాశినాయన : మండలంలోని గంగనపల్లె గ్రామంలో గురువారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



నగేష్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న కె.నగేష్‌కు బుధవారం రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్వీ యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సి. జయసుబ్బారెడ్డి పర్యవేక్షణలో ఆయన పత్ర సమర్పణ చేశారు. నగేష్‌కు డాక్టరేట్ రావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, కళాశాల అధ్యాపకబృందం బుధవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా నబీషాఖాద్రీ గంధోత్సవం



ప్రత్యేక ఫాతేహా చేస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : పెన్నానది సమీపంలో ఉన్న నబీషాఖాద్రీ గంధోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ, సయ్యద్‌షా అసద్‌పాషాఖాద్రీల ఆధ్వర్యంలో పకీర్ల మేళా తాళాలతో ఊరేగింపుచేశారు. సఫర్ నెల చివరి బుధవారం కావడంతో ముస్లింలు కుటుంబ సభ్యులతో విహారయాత్రకు పెన్నానదిలో గడిపారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్‌షా నూరుల్లా పాషాఖాద్రీ, సయ్యద్‌షా ఖాద్రీ, అహమ్మద్ పాషా షాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



విద్యానగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో గల విద్యానగర్, రిక్షా కాలనీలలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు దుద్దుకూరుసత్యం, రాజాయాదవ్, అనిల్, సంటియ్య, రమణారెడ్డి, వేణు, జయరామ్, రమణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాయునిపల్లె, వరికుంట్ల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగారు వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, క్రిష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



ఎర్రచందనం కేసుల్లోని పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

బద్వేలు అర్బన్ : ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడినా, అక్రమ రవాణాకు సహకరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో బద్వేలు రూరల్ సర్కిల్, పోరుమామిళ్ల సర్కిల్, అర్బన్ స్టేషన్ పరిధిలో గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ఉన్న పాత నేరస్తులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ఉన్న నేరస్తులపై గట్టి నిఘా ఉంటుందని, ఎవరైనా మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే కేసుల్లో ఉండి కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతున్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సీఐలకు సూచించారు. కార్యక్రమంలో సీఐలు సుదర్శన్‌ప్రసాద్, యుగంధర్, చిరంజీవి, ఎస్ఐలు వెంకటరమణ, చంద్రశేఖర్, హరిప్రసాద్, నాగమురళి, మల్లికార్జునరెడ్డి, కె.సి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని జరగనున్న ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్, మున్సిపల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఎక్సైజ్ అధికారులతో బుధవారం మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్‌తో కలిసి నిర్వహించిన ఉత్సవాల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, సంబంధిత అధికారుల అనుమతులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహాలను ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రతిష్ఠించేలా చూడాలని పోలీసులకు సూచించారు. అలాగే నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా మండపాల సమీపంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్, మండల పరిషత్ అధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమిషనర్, ఎక్సైజ్ అధికారులు, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు నాణ్యతగా చేయాలి



ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారిని సన్మానిస్తున్న ఎంఈఓలు

రాజుపాళెం : నాడు–నేడు కింద పాఠశాలల్లో జరుగుతున్న పనులు చాలా నాణ్యతగా చేయాలని ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పర్లపాడు గ్రామంలో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు తగు సూచనలు చేశారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రభాకర్ రెడ్డికి ఎంఈఓలు క్రిష్టఫర్, రామస్వామి రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్పీలు భార్గవీలత, సుబ్బరాయుడు, రాజేశ్వరి, భాను, సుదర్శన్ రెడ్డి, కొండయ్యలు పాల్గొన్నారు.

ఉత్సవాల కమిటీలు అనుమతి తీసుకోవాలి

ప్రొద్దుటూరు : వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా అనుమతి తీసుకుని విగ్రహాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులతో కలసి బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు జరుగుతాయని, అందరూ ముందస్తు అనుమతి పొందాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా కామనూరు బ్రిడ్జి వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో సీఐలు, ఎస్ఐలు, విద్యుత్‌శాఖ, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజుపాళెం : వినాయక చవితి పండుగలో భాగంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ముందుగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. రాజుపాళెంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఎస్పీ సిద్దార్థ కౌశల్, ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా వినాయక చవితి పండుగ జరుపుకునే గ్రామాలలోని కమిటీ సభ్యులు వివరాలను తెలియజేస్తూ పోలీసుల అనుమతి పొందాలన్నారు. వినాయక విగ్రహాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. నిబంధనల మేరకు పండుగను జరుపుకోవాలని, లేకుంటే కఠిన చర్యలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.